

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

## రోగులకు అందుబాటులో ఉండాలి

### డీఎంహెచ్‌వో అప్పయ్య

ఆత్మకూరు, నవంబర్ 2 : రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో అప్పయ్య వైద్యాధికారులకు సూచించారు. శనివారం ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అక్కంపేట, నీరుకుళ్ల, పెద్దాపురం గ్రామాల్లోని సబ్ సెంటర్లను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాము, కుక్క కాటుకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హాస్పిటళ్లలో అన్నిరకాల మందులు ఉన్నాయా? లేవా? అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్పందన, నర్సింగరావు, పుష్పలీల పాల్గొన్నారు.

## పలువురు కిట్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

హసన్‌పర్తి, నవంబర్ 2 : హైదరాబాద్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఫాక్స్‌కాన్‌లో ఉద్యోగాలకు కిట్స్‌లో ఫైనల్ ఇయర్ చదువున్న 64 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ ఆధారిత ప్రాసెస్ ఆటోమేషన్‌లో శిక్షణ పొందుతారన్నారు. కాగా, ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కిట్స్ చైర్మన్ లక్ష్మీకాంతారావు, కోశాధికారి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అభినందించారు.

## రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు అభినందన

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 2 : రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని అభిలాషించారు. విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు కామారెడ్డిలో, కబడ్డీ పోటీలు మహబూబ్‌నగర్ జిల్లా రాచాలలో జరుగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుణాత్మకవిద్య సమన్వయ అధికారి శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్ పాల్గొన్నారు.

## డైట్‌లో గెస్ట్ అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 2 : జిల్లా విద్య, శిక్షణా సంస్థ(డైట్), హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తాత్కాలిక విధానం ద్వారా భర్తీ చేస్తున్నామని, అర్హత కలిగిన ఉద్యోగ విరమణ పొందిన వారు లేక నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధానాచార్యులు అబ్దుల్‌హై తెలిపారు. వ్యాయామ విద్య-1(ఎంపీఈడీ), కళావిద్య(ఫైన్ ఆర్ట్స్, సంగీతం, నృత్యం, థియేటర్‌లో మాస్టర్స్ లేక బ్యాచిలర్ డిగ్రీ)లో అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీలోగా డైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

## సీఎంను కలిసిన కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 2 : కాకతీయ విశ్వవిద్యాలయ వీసీ ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

## కేయూను సందర్శించిన 'గ్రంథాలయ' చైర్మన్ రియాజ్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 2 : కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగాన్ని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ సందర్శించారు. రాజనీతి శాస్త్ర అకాడమిక్, ఆలుమ్నీ హాల్ అభివృద్ధికి ఎల్లవేళలా తన వంతు సహకారం ఉంటుందని, ఈ విభా విద్యార్థులు దేశంలో నూతన రాజకీయ ఒరవడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ సంకినేని వెంకట్, బీవోఎస్ గడ్డం కృష్ణయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సత్యనారాయణ, నాగరాజు, రీసెర్చ్ స్కాలర్స్ అంకిల్ల శంకర్, కల్లేపల్లి ప్రశాంత్, సురేశ్, రుబీనా, వినోద్, సతీశ్, నరేశ్, కార్తీక్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

ADMISSIONS

★Regular/One Sitting Admissions DMPHA(M), DOM, DMIT, DOA, DDIALY, DANS, GNM, B.Sc Nursing, BPham, B.Sc Agri @ 8500903904, 9493903904, 9515137392.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED

★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

★Wanted Experienced Staff for Car/Bike Cleaning Services. Contact Immediately Mobile No.: 9347481888.
NTW-000

TO-LET

★Commercial Building 3 Floors + Penthouse for Rent, Beside Akshaya Hotel, Jangaon. Ph: 8099573388.
NT-98831

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# మహా ధర్నాను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, నవంబర్ 2 : ఈ నెల 5వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే రాష్ట్రంలో ఆటో కార్మికుల జీవితాలు ఛిద్రం అయ్యాయన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేల భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి కోసం కార్మిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. చనిపోయిన ఆటో కార్మికుల కుటుంబాలకు రూ. 25 లక్షలు అందించాలన్నారు. పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, ఆటో యూనియన్ నాయకులు సంజీవ, బాబు, జయరాం, స్వామి పాల్గొన్నారు.

# టీచర్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ ప్రావీణ్య



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, నవంబర్ 2 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసన మండలి ఉపాధ్యాయుల నియోజకవర్గంలో ఓటరు నమోదుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చి 29న ఈ ఎమ్మెల్సీ పదవి పూర్తవుతున్న నేపథ్యంలో ఏర్పడే ఖాళీని భర్తీ చేసేందుకు ఓటర్ల జాబితా తయారీకి ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. నవంబర్ 1, 2024 అర్హతగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటరుగా నమోదు చేసుకొనేందుకు ఫారం-19 ద్వారా దరఖాస్తులను అసిస్టెంట్ ఓటరు నమోదు అధికారికి సమర్పించాలని సూచించారు. దరఖాస్తులతో పాటు నివాస రుజువు, ఆరు సంవత్సరాల్లో కనీసం మూడు సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేసినట్లు విద్యా సంస్థ అధిపతి నుంచి సర్టిఫికెట్ జతచేసి ఈ నెల 6వ తేదీలోగా సంబంధిత రెవెన్యూ డివిజినల్ అధికారి లేదా తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తులను https://ceotserms2.telangana.gov.in/mlc/form19.aspx ద్వారా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**విద్యార్థులకు అభినందన..**

జాతీయస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఏ యజ్ఞశ్రీ, రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించిన దివ్య వెంకటరామన్నను కలెక్టర్ తన చాంబర్‌లో అభినందించారు. భోపాల్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో యజ్ఞశ్రీ ప్రథమ స్థానం సాధించాలని ఆమె ఆకాంక్షించారు. డీఈవో వాసంతి, జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**వీసీలో పాల్గొన్న కలెక్టర్లు..**

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీసీలో కలెక్టరేట్ నుంచి హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, దివాకర పాల్గొన్నారు.

**కలెక్టర్‌ను కలిసిన డీసీఎస్‌వో..**

డీసీఎస్‌వో కొమురయ్య కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకు ముందు కొమురయ్య తన కార్యాలయంలో డీసీఎస్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. సివిల్ సప్లయ్ కార్యాలయ అధికారులు డీఎస్‌వోకు శుభాకాంక్షలు తెలిపారు.



గూడూరులో నోముకుంటున్న 58 రజక కుటుంబాలు

## రజకుల సామూహిక నోము

కమలాపూర్, నవంబర్ 2 : ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోతున్న ఈ రోజుల్లో 58 రజక కుటుంబాలు ఒకే చోట కలిసి దీపావళి నోము జరుపుకుని ఆదర్శంగా నిలిచారు. మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన 58 రజక కుటుంబాలు వారి బంధువులను పిలుచుకుని లక్ష్మీదేవికి పూజలు చేసి, పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. దీపావళి నోము తాతల నాటి నుంచి ఆచారంగా వస్తున్నదని, కుటుంబాలన్నీ ఒకే చోట చేరి పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.



జోడెద్దుల ప్రతిమలతో ఊరేగింపుగా వస్తున్న నేతకాని కులస్తులు

## జోడెద్దుల ప్రతిమలతో ఊరేగింపు

### రెండో రోజు వైభవంగా నేతకాని బతుకమ్మ వేడుకలు

హసన్‌పర్తి, నవంబర్ 2 : మండలంలోని సీతంపేటలో నేతకాని బతుకమ్మ వేడుకల్లో భాగంగా రెండోరోజు శనివారం చెరువు నుంచి తెచ్చిన బంకమట్టితో తయారు చేసిన జోడెద్దు ప్రతిమలను పురుషులు గ్రామంలో ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం వరుస ఉన్న వారిపై నీళ్లు చల్లుకున్నారు. వెంట తెచ్చిన పిండి వంటలను ఒకరికొకరు వాయనంగా ఇచ్చి పుకున్నారు. ఇంటికి వెళ్లి సుంకు వేసిన బియ్యంతో పాయసం వండి కేదారేశ్వరునికి నైవేద్యం సమర్పించారు.

**చివరి రోజు బతుకమ్మ వేడుకలు..**

ఆదివారం ఊరు చివర చెరువు కట్ట వద్ద స్త్రీలు, పురుషులు బతుకమ్మ ఆడి సందడి చేయనున్నారు. అనంతరం వెంట తెచుకున్న గురుగులకు ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ వేడుకలను వీక్షించడానికి వివిధ రాష్ట్రాల నుంచి బంధువులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

## భద్రకాళీ, రుద్రేశ్వరాలయాల్లో కార్తీక మాసోత్సవాలు

### ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా/వరంగల్, నవంబర్ 2 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయం, ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో కార్తీక మాసోత్సవాలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి మాసోత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఆలయంలో కనీస వసతులు కల్పించడం లేదంటూ ఈవోపై భక్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే రాష్ట్ర కమిషనర్‌కు ఫోన్ చేసి ఈవోను వెంటనే తొలగించాలని సూచించారు. అర్చకులు సందీప్‌శర్మ, గంగు మణికంఠశర్మ, సేవకులు ప్రసాద్, కాశీవిశ్వనాథచారి, ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, సుజాత, భద్రకాళీ ఆలయ ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు శేషు పాల్గొన్నారు.



రుద్రేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

## డైట్ చార్జీలు పెంచడంపై సంబురాలు

శాయంపేట, నవంబర్ 2 : డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో శాయంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో శనివారం సంబురాలు జరిపారు. ప్రిన్సిపాల్ రేవతి విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఏటీపీ సుభాష్‌చంద్ర, డీడబ్ల్యూ రవీందర్ పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రద్రం చేయండి

ఐనవోలు, నవంబర్ 2 : మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రద్రం చేయాలని జేఏసీ నాయకుడు మిద్దెపాక రవీందర్ పిలుపు నిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మాదిగ ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఈ నెల 4న హసన్‌పర్తి కేఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఈ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందన్నారు. జేఏసీ నాయకులు జన్ను రాములు, జన్ను నర్సయ్య, వల్లందాసు కుమార్, మారపల్లి ఎల్లయ్య పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 2 : వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 1996-99 బ్యాచ్ సివిల్ బ్రాంచ్ విద్యార్థులు శనివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. తమకు చదువులు చెప్పిన గురువులు ఎల్లయ్య, నాగేశ్వర్‌రావు, అప్పారావు, అనంతరెడ్డి, అశోక్, జీవీ రావును సత్కరించారు. కళాశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన కాలేజీ ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యులు టీవీ ప్రసాద్, నాగరాజు, చిరంజీవి, శరత్, రవి, విజయ్, ఆమ్రపాలి, సిల్వర్ జూబ్లీ బ్యాచ్‌మేట్స్, కాలేజీ పూర్వవిద్యార్థుల సంఘం ప్రచార కార్యదర్శి మేకల అక్షయ్‌కుమార్ పాల్గొన్నారు.

# వసతి గృహాల స్థితిగతులను ప్రభుత్వానికి నివేదిస్తాం

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- కమిషన్ సభ్యులతో కలిసి బాలికల వసతి గృహం తనిఖీ
- వసతుల కల్పనపై కలెక్టర్‌కు అభినందన



విద్యార్థినులతో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తదితరులు

హనుమకొండ, నవంబర్ 2 : రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల స్థితిగతులను ప్రభుత్వానికి నివేదిస్తామని బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్ అన్నారు. శనివారం బాలసముద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని కమిషన్ చైర్మన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు తనిఖీ చేసి విద్యార్థినులతో మాట్లాడి అక్కడి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టరేట్‌లో చేపట్టిన అభిప్రాయ సేకరణలో వసతి గృహాల్లోని వసతులపై అనేకమంది అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో హాస్టల్‌ను తనిఖీ చేశామన్నారు. బీసీల ఆర్థిక సామాజిక స్థితుగతులను అధ్యయనం చేయడం కోసం ప్రభుత్వం ఈ నెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహిస్తామని, విద్యార్థినులు ఈ సర్వేపై వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం హాస్టల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వంటశాలలోని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్‌కు తెలుపగా, వెంటనే స్పందించి నిర్మించారని వసతి గృహ సంక్షేమ అధికారి చెప్పగా, చైర్మన్ సభ్యులు కలెక్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ప్రత్యేకాధికారి సతీశ్, ఆర్డీవో రమేశ్ రాథోడ్, బీసీ వెల్ఫేర్ అధికారి రాంరెడ్డి, తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



ఐలమ్మ (ఫైల్)

ఎల్కతుర్తి, నవంబర్ 2 : హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామానికి చెందిన గిన్నారపు ఐలమ్మ(76) శనివారం ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలోని వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నది. ఎల్కతుర్తి ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐలమ్మ గత నెల 26న ఇంట్లో నుంచి పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు ఆరా తీసినప్పటికీ లభించలేదు. అయితే ఆమె కొన్ని నెలలుగా అనారోగ్యంతో పాటు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ క్రమంలోనే తిమ్మాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శనివారం ఆమె మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆమె కుమారుడు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఫార్మసీ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు వాయిదా

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 2 : నవంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు జరగాల్సిన కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ విభాగ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలను వాయిదా వేస్తున్నామని, మిగతా విభాగ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు యథావిధిగా జరుగనున్నాయి. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, నవంబర్ 2 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మెయింటనెన్స్ నేపథ్యంలో కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 7.30 నుంచి 9.30గంటల వరకు రేడియో స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

## చికిత్స కోసం స్నేహితుల ఆర్థికసాయం

దామెర, నవంబర్ 2 : మండల కేంద్రానికి చెందిన కదం రవి గుండె జబ్బు, బ్రెయిన్‌స్ట్రోక్‌తో బాధపడుతుండగా అతడి స్నేహితులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం రూ.50,800 అందజేసి తమ స్నేహాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సీతారాంనాయక్, ప్రొఫెసర్ బాలస్వామి, ఎక్స్ వలంటీర్లు ప్రియాప్రసన్న, సునీల్‌కుమార్, శ్రీనివాస్, నరసింహ, ప్రవీణ్, చంద్రశేఖర్, నిరంజని, విజయ్, మహేందర్‌రెడ్డి, అరవింద్ పాల్గొన్నారు.

## గంజాయి తాగిన ముగ్గురి అరెస్టు



గంజాయి తాగుతున్న వారిని అరెస్టు చూపుతున్న సీఐ పులి రమేశ్

ఎల్కతుర్తి, నవంబర్ 2 : మండల పరిధిలో గంజాయి తాగిన ముగ్గురిని శనివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు ఆయన మాట్లాడుతూ.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన కుర్ర అభిలాష్, ములుగూరి నవీన్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీ సంతోష్‌కుమార్ సాహూ గ్రామంలో గంజాయి సేవిస్తుండగా పక్కా సమాచారం మేరకు ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి వారిని పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సిబ్బంది మల్లేశం, రాజన్న, నిరంజన్, రంజిత్, వలీ, స్వరూప పాల్గొన్నారు

## మటన్ షాపు నిర్వాహకుడికి జరిమానా



మటన్ షాపు నిర్వాహకుడికి జరిమానా విధిస్తున్న బల్దియా అధికారులు

వరంగల్, నవంబర్ 2 : నిబంధనలకు విరుద్ధంగా డ్రై డే శనివారం రోజు మాంసం విక్రయిస్తున్న మటన్ షాపు నిర్వాహకుడికి బల్దియా అధికారులు జరిమానా విధించారు. శనివారం నర్సంపేట రోడ్డులోని ఏ-1 మటన్ షాపులో మాంసం విక్రయిస్తున్న సమాచారం తెలుసుకున్న బల్దియా అధికారులు తనిఖీ చేసి రూ. 3వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఎంహెచ్‌వో రాజారెడ్డి మాట్లాడుతూ.. నగరంలో మాంసం విక్రయదారులు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీనివాస్, జవాన్లు నాగరాజు, సాంబయ్య పాల్గొన్నారు.

## రౌడీ షీటర్‌పై పీడీయాక్టు



పీడీ యాక్టు ఉత్తర్వులను అందజేస్తున్న సీఐ వెంకటరత్నం

నయీంనగర్, నవంబర్ 2 : రౌడీ షీటర్‌పై వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శనివారం పీడీయాక్టు ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, హత్యకు పాల్పడిన కాశీబుగ్గ మధురానగర్ ప్రాంతానికి చెందిన గడ్డం సంపత్‌కు పీడీయాక్టు ఉత్తర్వులను మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం హుజూరాబాద్ సబ్ జైల్లో అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. నిందితుడు సెప్టెంబర్ 13న మరొకరితో కలిసి ఒకరిని కొట్టడంతో పాటు దోపిడీ కేసులో అరెస్టు చేసి జైలుకు తరలించారు. గతంలో తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యకేసు, మరికొన్ని హత్యాయత్నం కేసుల్లో నిందితుడు జైలుకు వెళ్లినా అతడిలో మార్పు రాకపోవడంతో పీడీ యాక్టు నమోదు చేశామని సీపీ తెలిపారు.

## ఐదు మొరం టిప్పర్ల పట్టివేత



పట్టుకున్న మొరం టిప్పర్లను చూపిస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు, అక్టోబర్ 2 : మొరం అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పంథిని శివారులో అనుమతి లేకుండా టిప్పర్లలో మొరం తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి పోలీసు సిబ్బందితో కలిసి సోదా నిర్వహించగా ఐదు టిప్పర్లను సీజ్ చేసి పోలీసు స్టేషన్ తరలించి, ఓనర్లు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోదాల్లో కానిస్టేబుళ్లు శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

## మీ సేవలు స్ఫూర్తిదాయకం : సీపీ

నయీంనగర్, నవంబర్ 2 : కష్టనష్టాలను అధిగమించి విజయవంతంగా విధులు నిర్వర్తించిన పోలీసులు స్ఫూర్తిదాయకమని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసులను ఆయన శనివారం సత్కరించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేశ్ కుమార్ పాల్గొన్నారు.

## మర్రిపెల్లిగూడెంలో కార్డన్‌సెర్చ్

కమలాపూర్, నవంబర్ 2 : మండలంలోని మర్రిపెల్లిగూడెం గ్రామంలో కార్డన్ సెర్చ్ శనివారం నిర్వహించినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. సరైన పత్రాలు లేని 30 వాహనాలకు జరిమానా విధించారు. కంకటి సూర్యం హోటల్‌లో 20బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. హసన్‌పర్తి సీఐ చేరాలు పాల్గొన్నారు.